www.netifocusnews.com
నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
తెలుగు డిజిటల్ దినపత్రిక
తెలంగాణ జిల్లాలు
శుక్రవారం 26, సెప్టెంబర్ 2025 | పేజీలు 4



# మద్యం టెండర్లకు వేళాయే..

- నేటి నుంచే దరఖాస్తుల స్వీకరణ
- అక్టోబర్ 18వరకు గడువు... 23న లక్కీడ్రా
- ఫీజు రూ.2లక్షల నుంచి రూ.3లక్షలకు పెంపు

హైదరాబాద్,
(నేటి ఫోకస్‌న్యూస్)-సెప్టెంబర్ 25:

మద్యం షాపుల టెండర్‌కు లైసెన్స్‌ల గడువు పూర్తికాకముందే ప్రభుత్వం రెండు నెలల ముందే నోటిఫికేషన్ జారీ చేసింది. గతంలో రూ.2 లక్షలు ఉన్న టెండర్ ఫీజు(నాన్ రిఫండబుల్)ను ఈసారి రూ.3లక్షలకు పెంచి ప్రభుత్వ ఖజానా నింపేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో 2025-27 మద్యం పాలసీని అమలు చేసేందుకు జిల్లాల్లో దర ఖాస్తుల స్వీకరణకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు అంతా సిద్ధం చేశారు. మద్యం షాపులలో ఎస్సీలకు 10శాతం, ఎస్టీలకు 5శాతం గౌడ్స్‌కు 15శాతం రిజర్వేషన్లు కేటాయించింది. గురువారం మద్యం షాపుల టెండర్లకు ప్రభుత్వం నోటిఫికేషన్ వెలువరించిన నేపథ్యంలో జిల్లాల కలెక్టర్లు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆధ్వర్యంలో రిజర్వేషన్లకు డ్రా తీశారు. మద్యం షాపుల లైసెన్స్‌లు నవంబరు 30వ తేదీ వరకు గడువు ఉంది. అక్టోబరులో స్థానిక ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కోడ్ రానుండడంతో రెండు నెలల ముందుగానే మద్యం షాపుల వేలం ప్రక్రియను నిర్వహించాల ని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మద్యం పాలసీని ప్రకటిస్తూ జీవో జారీ చేసింది. గతంలో ఉన్న దరఖాస్తు ఫీజును (నాన్ రిఫండబుల్) రెండు లక్షల నుంచి మూడు లక్షల కు పెంచింది. మిగతా విషయాల్లో పాత పాలసీనే అనుసరించింది. జనాభా ప్రాతిపదికన లైసెన్సు ఫీజును వసూలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్‌ను జారీ చేసింది. 2025 డిసెంబరు 1 నుంచి 2027 నవంబరు 30వ తేదీ వరకు నూతన మద్యం విధానం అమల్లోకి వస్తుంది.

**లాటరీ ద్వారా ఎంపిక..**

గతంలో మాదిరిగానే లాటరీ ద్వారా వైన్ షాపుల లైసెన్స్‌దారులను ఎంపికచేయనున్నారు. మద్యం షాపు లైసెన్స్ కోసం ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఎక్సైజ్ టాక్స్‌ను గతంలో మాదిరిగా ఆరు విడతల్లో చెల్లించేందుకు వీలు కల్పించారు. కొత్త పాలసీ ప్రకారం మద్యం రిటైల్ షాపులన్నీ విధిగా మూడు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ కెమెరాలను ఎక్సైజ్ కంట్రోల్‌రూంకు అనుసంధానం చేస్తారని పాలసీలో పేర్కొన్నారు. వైన్స్ వద్ద విధిగా పార్కింగ్ స్థలాలను కూడా లైసెన్సుదారులే ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది.

**జనాభా ప్రాతిపదికన లైసెన్స్ ఫీజు..**

జనాభా ప్రాతిపదికన లైసెన్స్ ఫీజులు ఖరారు చేశారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా ఐదు వేల లోపు జనాభా ఉన్న ప్రాంతాలకు ఏడాదికి 50 లక్షల లైసెన్స్ ఫీజు నిర్ణయించారు. 5001 జనాబా నుంచి 50 వేల లోపు జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ. 55 లక్షలు, 50,001 జనాభా నుంచి లక్ష జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ. 60 లక్షల ఫీజును ఖరారు చేశారు. 1,00,001 జనాభా నుంచి ఐదు లక్షల లోపు ఉన్న ప్రాంతాలకు రూ. 65 లక్షలు, 5,00,001 జనాబా నుంచి 20,00,000 జనాభా ఉన్న ప్రాంతాలకు 85 లక్షలు, 20 లక్షలపైగా జనాభా ఉన్న ప్రాంతాల కు కోటి 10 లక్షల లైసెన్స్ ఫీజుగా ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. వైన్‌షాపులకు సింగిల్ దరఖాస్తు వచ్చిన సందర్భంలో ఆ మద్యం షాపులను ముందుగానే ఖరారు చేసి ప్రకటిస్తారు. ఒకటికి మించి దరఖాస్తులు వచ్చిన సందర్భంలో లాటరీ ద్వారా లైసెన్స్‌దారులను ఖరారు చేయనున్నారు.

**నేడు నోటిఫికేషన్..**

జిల్లాలోని 94 వైన్‌షాపుల వేలం ద్వారా లైసెన్స్ ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్‌ను శుక్రవారం కలెక్టర్ జారీ చేయనున్నారు. అదే రోజు (26వ తేదీ) నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమై అక్టోబరు 18వ తేదీ సాయంత్రం వరకు చివరి గడువుగా నిర్ణయించారు.





# సర్కార్ చేతికి మెట్రో

## మొదటి దశ నిర్వహణ ప్రభుత్వానిదే..

- 13 వేల కోట్ల రుణం చెల్లింపునకు అంగీకారం..
- కంపెనీ వాటా కింద ఎల్ అండ్ టీకి 2 వేల కోట్లు
- కంపెనీ ప్రతినిధులతో చర్చలు..
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కుదిరిన ఒప్పందం

హైదరాబాద్,
(నేటి ఫోకస్‌న్యూస్)-సెప్టెంబర్ 25:

**హైదరాబాద్ నగర భవిష్యత్తుకు** సంబంధించి కీలకమైన ముందడుగు పడింది. మెట్రో రైలు సేవలను నగరమంతా విస్తరించేందుకు అవసరమైన రెండో దశ, మూడో దశ మెట్రోల నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోయాయి. రెండు, మూడు దశల్లో ఏ రకంగానూ భాగస్వామ్యం పంచుకోవడానికి సిద్ధంగా లేని ఎల్ అండ్ టీ సంస్థను సాగనంపి, తొలిదశ మెట్రోను స్వాధీనం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దాంతో దేశంలోనే తొలి ప్రైవేటు మెట్రో.. ప్రభుత్వపరం అవుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి గురువారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎల్ అండ్ టీ ప్రతినిధులతో చర్చలు జరిపారు. మెట్రో మొదటి దశ కింద ఉన్న రూ.13 వేల కోట్ల అప్పులను ప్రభుత్వం తీసుకోవడానికి అంగీకరించారు. హైదరాబాద్ మెట్రో రైల్ స్పెషల్ పర్పస్ వెహికిల్‌లో ఎల్ అండ్ టీ భాగమైన రూ.5,900 కోట్ల మొత్తంలో రూ.2000 కోట్లు వన్ టైం సెటిల్‌మెంట్ కింద చెల్లించేందుకు సమ్మతి తెలిపారు. ఈ ప్రక్రియ ముగిసిన వెంటనే మెట్రో తొలిదశ నిర్వహణ ప్రభుత్వం చేతికి వస్తుంది. రెండోదశ పనులకు మార్గం సుగమం అవుతుంది. ఒకప్పుడు దేశవ్యాప్తంగా మెట్రో రైలు నెట్‌వర్క్ పొడవులో రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్ నేడు తొమ్మిదో స్థానానికి దిగజారింది. నగర విస్తరణ, పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం రెండోదశ కింద 2ఏ, 2బి పేరుతో 8 మార్గాలతో కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. మొత్తం 163 కిలోమీటర్ల అదనపు మెట్రో నెట్‌వర్క్ ఏర్పాటుపై కేంద్రంతో పలు దఫాలుగా చర్చలు జరిపింది. ఈ ప్రతిపాదనలపై కేంద్రం అభ్యంతరం వ్యక్తం చేసింది. రెండో దశ పనులను రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుండగా, మొదటి దశను ఎల్ అండ్ టీ నిర్మించి నిర్వహిస్తోంది. రెండు దశల ప్రాజెక్టుల సమన్వయం కోసం ఎల్ అండ్ టీతో రాష్ట్ర ప్రభుత్వానికి కలిసి పని చేయడం మీద పక్కా విధివిధానాలతో ఒక ఒప్పందం(డెఫినిటివ్ అగ్రిమెంట్) ఉండాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. రెండో దశ పనుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి ఏర్పాటుచేసే జాయింట్ వెంచర్‌లో భాగస్వామి కావాలని కూడా ఎల్ అండ్ టీని కేంద్రం ఆహ్వానించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన రెండోదశ ప్రాజెక్టులో భాగస్వామిగా ఉండలేమని ఎల్ అండ్ టీ స్పష్టం చేసింది. డెఫినిటివ్ అగ్రిమెంట్‌పై సంతకం చేయలేమని తేల్చిచెప్పింది. ఎల్‌టీ-ఎంఆర్‌హెచ్-ఎల్‌లో ఉన్న తమ వాటాను రాష్ట్ర ప్రభుత్వం లేదా కేంద్ర ప్రభుత్వం కొనుక్కుంటానంటే విక్రయించడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించింది.


# సంస్థాన విశేషాలపై ప్రత్యేక భేటీ

### -రాజా కృష్ణదేవరావుతో ఎస్పీ రావుల గిరిధర్ మర్యాదపూర్వక భేటీ.



**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:**

దేవీ శరన్నవరాత్రులను వనపర్తి సంస్థాన వారసులు రాజ కృష్ణదేవరావు అత్యంత భక్తి శ్రద్ధలతో, ఉపవాస దీక్షలతో చేపడతారు. ఇందులో భాగంగా నవరాత్రులు పూర్తయ్యే వరకు ఆయన వనపర్తి లోని తన నివాసంలో ఉంటూ ప్రత్యేక పూజలు చేయడం మొదటి నుంచి ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగానే వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ గురువారం ఆయన నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం సంస్థాన విషయాలపై లోతైన అధ్యయనం చేశారు. 450 సంవత్సరాలకు పైగా సాగిన సంస్థాన విశేషాలను వారు చర్చించుకున్నారు. సంస్థానాధీశులు తమ పాలనా కాలంలో ప్రజలకు అవసరమైన వ్యవసాయ వాణిజ్య తాగు సాగునీటి సౌకర్యాలు కల్పించడమే గాక సాంస్కృతిక సాంకేతిక పరిజ్ఞానానికి పెద్దపీట వేసిన వివరాలను గుర్తు చేశారు. "సూగూరు సిక్క"పేరున వనపర్తి సంస్థానానికి ప్రత్యేక కరెన్సీ ని ఏర్పాటు చేసి నిజాం రాష్ట్రంలో అది చెల్లుబాటు అయ్యేలా అనుమతులు ఉండేవని రాజకృష్ణదేవరావు జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ కు వివరించారు. జిల్లాలో శాంతిభద్రతల గురించి ఆయన ఎస్పీని అడిగి తెలుసుకున్నారు. ఏదేని అవసరమైతే తమ వంతు సహకారం అందిస్తామని ఎస్పీకి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ కిరణ్ కుమార్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ అప్పలనాయుడు, పట్టణ ఎస్ఐ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫోకస్ న్యూస్ సెప్టెంబర్ 25**

టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి %డ ౧+××జ% చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు %జణజ% చైర్మన్ గడిల రామ్ రెడ్డి ఆధ్వర్యంలో సదాశివపేట మండలంలో వెంకటాపూర్ గ్రామానికి చెందిన గొంటెల సువర్ణ కి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 60 వేల రూపాయలు చెక్కును అందజేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో వెంకటాపూర్ %జుశ% ఎంపిటిసి ఒగ్గు శ్రీనివాస్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు దుర్గంబోయి కృష్ణ, ఏటిగడ్డ సంఘం తాజా మాజీ సర్పంచ్ నర్సింలు , ఆత్మకూర్ సర్పంచ్ గంగన్న , మార్కెట్ కమిటీ డైరెక్టర్ యూసుఫ్ , మోహన్ , అజీమ్ ,వెంకట్ రెడ్డి పాల్గొన్నారు

# పేటలో ఘనంగా దీన దయాల్ జయంతి వేడుకలు



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫోకస్ న్యూస్ సెప్టెంబర్. 25**

ఈరోజు సదాశివపేట పట్టణ బి. జే. పి. కార్యాలయంలో దీనదయాళ్ ఉపాధ్యాయుని జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల మాణిక్ రావు మాట్లాడుతూ దీన్ దయాళ్ ఉపాధ్యాయులు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ మాజీ అధ్యక్షుడు, భారతీయ జనతా పార్టీ హైందవ రాష్ట్రం సిద్దాంతకర్త. పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ 1916 సెప్టెంబర్ 25న ఉత్తర ప్రదేశ్ లోని మధుర దగ్గర 'నగ్ల చంద్రభాన్' అనే గ్రామంలో జన్మించారు. 1937లో మొదట స్వయంసేవకులలో ఒకరిగా చేరి ప్రాదేశిక సహ ప్రచారక్ స్థాయికి ఎదిగారని ఈ సభాముఖంగా తెలియ పరిచారు. ఇట్టి కార్యక్రమంలో మాజీ పట్టణ బి. జె. పి. పట్టణఅధ్యక్షులు శ్రీనివాస్ ఆర్య, పట్టణ ఉపాధ్యక్షులు కూచని సతీష్ కుమార్, ప్రధాన కార్యదర్శి, ఉపన్నగారి శ్రీశైలం, కిసాన్ మోర్చ పట్టణ అధ్యక్షుడు జి.శివలింగం, పట్టణ ఉపాధ్యక్షుడు భవాని ప్రసాద్ యాదవ్, సీనియర్ నాయకులు శ్రీకాంత్ రాజ్, మున్ను రు నాగరాజ్ తదితర నాయకులు పాల్గొన్నారు



# చెవిటి యువతికి వినికిడి యంత్రం

### -ఏడు లక్షల ఎల్ఓసి ఇప్పించి మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి.

**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:**

వనపర్తి జిల్లా కేంద్రంలో నివాసం ఉండే నందమోని బాలరాజు కూతురు రేవతి పుట్టుక నుంచే వినికిడి లోపంతో బాధపడుతోంది. 25 రోజుల క్రితం ఆమె వివాహ శుభకార్యానికి హాజరైన ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆమెను చూసి చలించిపోయారు. రూపం బాగా ఉన్నప్పటికీ వినలేని స్థితిలో ఉండడంతో ఆయన ఏమి చేస్తే ఆమె సమస్యకు పరిష్కారం దొరుకుతుందని తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ఖరీదైన యంత్రం వాడితే వినికిడి సమస్యకు కాస్త పరిష్కారం దొరుకుతుందని చెప్పడంతో ఆయన వెంటనే ప్రభుత్వం ద్వారా గట్టి ప్రయత్నం చేసి ఏడు లక్షల ఎల్ఓసి ఇప్పించారు. దీంతో కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే మేఘారెడ్డిని దేవుడి రూపంలో తమ కూతురు పట్ల దర్శనమిచ్చాడని కొనియాడుతూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# గోపాల్ పేట, ఏదుల, రేవల్లి మండలాలకు నూతన వ్యవసాయ మార్కెట్ మంజూరు

### -జీవో 112 జారీ చేసిన ప్రభుత్వం.

### -సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే మేఘారెడ్డి.

**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:**



వనపర్తి జిల్లాలోని గోపాల్పేట, ఏదుల, రేవల్లి మండలాలకు నూతన వ్యవసాయ మార్కెట్ యార్డ్ మంజూరైనట్లు ఎమ్మెల్యే మేఘారెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వ్యవసాయం అధికంగా పెరిగి పంటల దిగుబడులు బాగా రావడంతో రైతులు తమ ధాన్యాన్ని మార్కెట్ చేసుకునేందుకు సమీప ప్రాంతంలో ఉండే విధంగా తాను కృషి చేసినట్లు ఆయన తెలిపారు. పైన పేర్కొన్న మండలాల పరిధిలో నూతన వ్యవసాయ మార్కెట్ యార్డ్ మంజూరు చేయాలని గతంలో సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావుకు విజ్ఞప్తి చేసినట్లు ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 112 జారీ చేస్తూ ఉత్తర్వులు వెలువరించడంతో రైతుల కష్టాలు తీరనున్నాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఇన్చార్జ్ మంత్రి దామోదర రాజనర్సింహ, జిల్లా మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి లకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# గ్రూప్ 1 తుది ఫలితాలు విడుదల చేసిన టీజీపీఎస్సీ

**అర్ధరాత్రి గ్రూప్ 1 ఫలితాలను విడుదల చేసిన టీజీపీఎస్సీ**

**ఫస్ట్ ర్యాంక్ సాధించిన హైదరాబాద్ ఏఎస్ రావునగర్‌కు చెందిన డాక్టర్ లక్ష్మీదీపిక**

**టాప్ 10 ర్యాంకర్లు అందరూ ఆర్డీఓలకు ఎంపిక**




హైదరాబాద్, ఫోకస్ న్యూస్ సెప్టెంబర్ 25

రాష్ట్రంలోని 563 గ్రూప్-1 సర్వీసుల పోస్టులకు సంబంధించిన తుది ఫలితాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నిన్న అర్ధరాత్రి తర్వాత విడుదల చేసింది. హైకోర్టు తాజా ఉత్తర్వులతో నియామక ప్రక్రియ కొనసాగించేందుకు మార్గం సుగమం కావడంతో, కమిషన్ తుది ఎంపికల జాబితాను విడుదల చేసింది.

కమిషన్ చైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపిన వివరాల ప్రకారం.. మొత్తం 563 ఖాళీలకు గాను 562 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. ఒక పోస్టును న్యాయ వివాదం నేపథ్యంలో విత్‌హెల్డ్ (తాత్కాలికంగా నిలిపివేత) కింద ఉంచినట్లు వెల్లడించారు.

**ఎంపిక ప్రక్రియ వివరాలు**

ఎంపిక చేసిన అభ్యర్థుల జాబితా మెరిట్, పోస్టుల ప్రాధాన్యత, రిజర్వేషన్, రోస్టర్ విధానాల ఆధారంగా రూపొందించబడినట్లు కమిషన్ తెలిపింది. అభ్యర్థులు ముఖ్యంగా తాము కోరిన పోస్టులను ఎంపిక చేసుకున్న క్రమం, ప్రధాన పరీక్షల్లో పొందిన మార్కులు తదితరాలను పరిగణనలోకి తీసుకుని తుది ఎంపికలు పూర్తయ్యాయి.

మల్టీజోన్-1లో: 258 పోస్టులు

మల్టీజోన్-2లో: 304 పోస్టులు

**టాప్-10 ర్యాంకర్లు %-% అందరూ ఆర్డీవోలకు ఎంపిక**

ఈసారి గ్రూప్-1 ఫలితాల్లో టాప్-10 ర్యాంకులు సాధించిన అభ్యర్థులంతా ఆర్డీవో (ఆర్‌డీఓ) పోస్టులను ఎంపిక చేసుకున్నారు.

టాప్ ర్యాంకులు సాధించిన అభ్యర్థులు వీరే: లక్ష్మీదీపిక, దాడి వెంకటరమణ, వంశీకృష్ణారెడ్డి, జిన్నా తేజస్విని, కృతిక, హర్షవర్ధన్, అనూష, నిఖిత, భవ్య, శ్రీకృష్ణసాయి.

డాక్టర్ లక్ష్మీదీపికకు ఫస్ట్ ర్యాంక్: హైదరాబాద్ ఏఎస్‌రావు నగర్‌కు చెందిన డాక్టర్ లక్ష్మీదీపిక 550 మార్కులతో రాష్ట్ర టాపర్‌గా నిలిచింది. ఆమె ఉస్మానియా యూనివర్సిటీలో వైద్య విద్య పూర్తిచేసింది. మల్టీజోన్-2 కేటగిరీలో ఆమెకు ఆర్డీవో పోస్టు లభించింది.

ఇక మల్టీజోన్-1 టాపర్ అయిన హనుమకొండ జిల్లాకు చెందిన జిన్నా తేజస్విని 532 మార్కులతో ఆర్డీవోగా ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆమె మండల పంచాయతీ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు.

నల్గొండ జిల్లాకు చెందిన దాడి వెంకటరమణ 535.5 మార్కులతో రెండో ర్యాంకును సాధించారు. ఆయన కూడా ఆర్డీవో పోస్టును పొందారు.

హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును నిన్న హైకోర్టు ధర్మాసనం నిలిపివేయడంతో, ఫలితాల ప్రకటనకు మార్గం సుగమం అయింది. ఈ క్రమంలో అర్ధరాత్రివరకు కమిషన్ కసరత్తు చేసి తుది ఎంపికల జాబితాను విడుదల చేసింది.

ఎవరైనా అభ్యర్థి తప్పుడు సమాచారం ఇచ్చినట్లు నిర్ధారణ అయితే తక్షణమే నియామకాన్ని రద్దు చేయనున్నట్లు కమిషన్ స్పష్టం చేసింది. కాగా, జనరల్ మెరిట్‌లో టాప్-10లో 6 మంది మహిళలు ఉన్నారు.

టాప్-100లో 41 మంది మహిళలు ఉన్నారు. టాప్ 100లో తెలంగాణ స్థానికేతర అభ్యర్థులు ఐదుగురు సత్తా చాటారు.



# నాచారం లో దీనదయాళ్ ఉపాధ్యాయ్ జయంతి వేడుకలు

**దీనదయాళ్ ఉపాధ్యాయ ఆలోచనలు నేటికీ స్ఫూర్తిదాయకం... రాగిరి మోహన్ రెడ్డి**

నాచారం,సెప్టెంబర్ 25 (నేటి ఫోకస్ న్యూస్):

పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నాచారంలోని నేతాజీ శక్తి కేంద్రం ఇంచార్జి రాగిరి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో "మా కే నామ్ పే ఏక్ పేడ్"కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రాగిరి మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. దీన్ దయాళ్ ఉపాధ్యాయ అంత్యోదయ భావాజాలం దేశానికి మార్గదర్శకం. ఆయన దేశానికి మార్గదర్శకుడు అని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు వై సత్యనారాయణ రావు, మల్కా ప్రకాష్, డివిజన్ అధ్యక్షుడు నవీన్ కుమార్, మహిళా కన్వీనర్ అనిత రెడ్డి, వరలక్ష్మి, నాయకులు దయానంద గౌడ్, ప్రతాపరెడ్డి వెంకటేష్ గౌడ్, ఆనంద్ గుప్తా, యువ నాయకులు బాలు, శ్రీనివాస్ యాదవ్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పీఎఫ్ డబ్బులు ఇక ఏటీఎం నుంచే

**ఉద్యోగులకు త్వరలో కొత్త సౌకర్యం!**

**పీఎఫ్ ఖాతాదారులకు త్వరలో ఏటీఎం విత్‌డ్రా సౌకర్యం**

**వచ్చే ఏడాది జనవరి నుంచి సేవలు ప్రారంభించే అవకాశం**

**అక్టోబర్ బోర్డు సమావేశంలో దీనిపై తుది నిర్ణయం**

**డెబిట్ కార్డు తరహాలో ప్రత్యేక కార్డు జారీ చేయనున్న ఈపీఎఫ్ఓ**

**అత్యవసర సమయాల్లో నగదు కోసం సులభమైన మార్గం**

హైదరాబాద్, ఉదయం న్యూస్

కోట్లాది మంది ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్ఓ) చందాదారులకు ఒక శుభవార్త. అత్యవసర సమయాల్లో పీఎఫ్ ఖాతా నుంచి డబ్బులు తీసుకునే ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు తీసుకున్నట్లే, ఇకపై ఏటీఎంల ద్వారా నేరుగా పీఎఫ్ నగదును విత్‌డ్రా చేసుకునే సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురానుంది. ఈ కొత్త విధానం 2026 జనవరి నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉంది.




ఈ ప్రతిపాదనపై తుది నిర్ణయం తీసుకునేందుకు ఉద్యోగుల భవిష్య నిధి సంస్థకు చెందిన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీలు (సీబీటీ) అక్టోబర్ రెండో వారంలో సమావేశం కానున్నట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ సమావేశంలో ఆమోదం లభించిన వెంటనే, కొత్త సేవలను ప్రారంభించేందుకు మార్గం సుగమం అవుతుంది.

వాస్తవానికి ఈ సదుపాయాన్ని ఈ ఏడాది జూన్‌లోనే తీసుకురావాలని కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ తొలుత భావించింది. దీనికి అవసరమైన ఐటీ మౌలిక సదుపాయాలను కూడా సిద్ధం చేసింది. అయితే, నగదు ఉపసంహరణపై పరిమితి విధించకపోతే, భవిష్య నిధి అసలు లక్ష్యం దెబ్బతింటుందనే ఆందోళనలు బోర్డు సభ్యుల నుంచి వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలోనే విత్‌డ్రా లిమిట్‌పై స్పష్టత ఇచ్చేందుకు ఈ నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదా వేశారు. అక్టోబర్ సమావేశంలో ఈ అంశంపైనే ప్రధానంగా చర్చ జరగనుంది.

ఈ సేవలు అందుబాటులోకి వస్తే, ఈపీఎఫ్ఓ తన చందాదారులకు ఏటీఎం డెబిట్ కార్డు తరహాలోనే ఒక ప్రత్యేక కార్డును జారీ చేస్తుంది. ఈ కార్డు ఉపయోగించి చందాదారులు ఎలాంటి పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేకుండా నేరుగా ఏటీఎం కేంద్రానికి వెళ్లి డబ్బులు తీసుకోవచ్చు. అత్యవసర ఆర్థిక పరిస్థితుల్లో ఉద్యోగులకు ఇది ఎంతగానో ఉపకరిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ సేవలను అమలు చేయడానికి బ్యాంకులు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో కార్మిక మంత్రిత్వ శాఖ ఇప్పటికే చర్చలు జరిపింది.

ప్రస్తుతం ఈపీఎఫ్ఓలో 7.8 కోట్ల మంది ఖాతాదారులు ఉండగా, వారి ఖాతాల్లో సుమారు రూ.28 లక్షల కోట్లు జమ అయి ఉన్నాయి. సీబీటీ సమావేశంలో తుది నిర్ణయం వెలువడిన తర్వాత విత్‌డ్రాలకు సంబంధించిన పూర్తి మార్గదర్శకాలు వెలువడనున్నాయి.

# ఉజ్వల లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫోకస్ న్యూస్ సెప్టెంబర్ 25



స్థానిక ఉజ్వల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కూచి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీయులు రంగు రంగు పూలతో బతుకమ్మలను పేర్చి బతుకమ్మ ఆట పాటలతో బతుకమ్మను ఆడినారు. బతుకమ్మ పాటలతో పాటుగా ఉల్లాసంగా కోలాటం దాండియా నుత్యాలు చేసినారు.

ప్రిన్సిపాల్ కూచి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడలేని సాంప్రదాయము కేవలము మన తెలంగాణలో మాత్రమే తొమ్మిది రోజులు పూలను పూజించి పకృతిని ఆరాధించి పూలతో తయారు చేసిన బతుకమ్మలు ఆడడము కేవలము మన తెలంగాణ ఆడపడుచులకే దక్కింది అని అన్నారు.

ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ పోల వెంకటేశం, వైస్ ప్రిన్సిపాల్ అమరేందర్ రెడ్డి, డైరెక్టర్లు రఘువర్ధన్ రెడ్డి, ఎం ముద్ద నాగనాథ్, లెక్చరర్లు సునీత, స్వాతి, జివిత,, ప్రియాంక , వరలక్ష్మి, లావణ్య, మమత ,నరేష్, నర్సింలు, గంగయ్య , సంగమేశ్వర్ రెడ్డి, ప్రవీణ్, రాజు, సమీర్, నవాబ్ విద్యార్థినిలు పాల్గొన్నారు